





పంచాయతీల్లో పైసల్లేవ్!

ఎంపీడీవోకు కారదర్శి వినతిపత్రం

దుబ్బాక మండలం పద్మశాలిగడ్డకు చెందిన పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేకాధికారి కలిసి దుబ్బాక ఎంపీడీవోకు వినతి పత్రం(అభ్యర్థన లేఖ) ద్వారా సమస్యలను ఏకరువు పెట్టడం జిల్లాలో చర్చానీయాంశంగా మారింది. ప్రభుత్వాన్ని నిలదీయక, జీతాలపై సిబ్బందికి సమాధానం చెప్పలేక ఎంపీడీవో కోర్టులో బంతిని నెట్టేందుకు వినతిపత్రం అందించడం గమనార్హం. ఎలాంటి ఆటంకం కలగకుండా పంచాయతీని నిర్వహించడం కోసం రూ.4 లక్షలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ట్రాక్టర్ నిర్వహణకు, సర్వీసింగ్, బ్లీచింగ్ పౌడర్, స్టేషనరీ, ఇద్దరి ఎంపీడబ్ల్యూ బీమా, పాత ఓహెచ్ఎస్ఆర్ తోపాటు పలు అత్యవసర సేవల నిర్వహణకు నిధులు విడుదల చేయాలని పేర్కొన్నారు. అయితే, ప్రభుత్వం నిధులను విడుదల చేస్తేగానీ, ఎంపీడీవో వాటిని అందించలేరనే విషయం తెలిసిందే. అధికారులకు ప్రజలు, నాయకులు విన్నవించుకోవడం చూశాం కానీ, ఇలా గ్రామస్థాయి అధికారి మండలాధికారికి వినతిపత్రం అందించడం చూస్తేనే వారి పరిస్థితి ఏంటో అర్థమవుతోంది.


Office of the Gram Panchayat, Padmashaligadda
Dubbak(M), Siddipet(Dist)

దుబ్బాక ఎంపీడీవోకు నిధుల కోసం అందజేసిన అభ్యర్థన లేఖ

- భారంగా మారిన నిర్వహణ
- సిబ్బందికి జీతాలు ఇవ్వలేక సతమతం
- గ్రామ కార్యదర్శులపై పెరుగుతున్న ఒత్తిడి
- నిధులు సమకూర్చాలంటూ ఎంపీడీవోకు పద్మశాలిగడ్డ కార్యదర్శి వినతి

దుబ్బాక, మే 19 : గ్రామ పంచాయతీలను నిధుల కొరత వేధిస్తోంది. ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారడంతో పంచాయతీల నిర్వహణ అధ్వానంగా మారింది. డీజిల్‌కు, కరెంటు బిల్లులకు డబ్బు సర్దుబాటు పంచాయతీ కార్యదర్శులు సతమతమవుతున్నారు. మరోవైపు సిబ్బంది జీతాలు చెల్లించలేని దుస్థితి నెలకొన్నది. గతంలోనూ నిధుల సమస్య తలెత్తినా పాలకవర్గాలు ఏదోలా నెట్టుకొచ్చారు. ఫిబ్రవరిలో పంచాయతీ పాలకవర్గాల పాలన ముగియగా ప్రభుత్వం స్పెషలాఫీసర్లను నియమించింది. వారు పేరుకే ప్రత్యేకాధికారులు తప్ప పంచాయతీల సమస్యలను పట్టించుకోవడం లేదు. సర్పంచులు ఉన్నప్పుడైనా ఏదో రకంగా నిర్వహణ ఖర్చులు సర్దుబాటు అయ్యేలా చూసేవారు. ఏ ఆదాయ వనరులు లేని చిన్న గ్రామ పంచాయతీల పరిస్థితి అయితే మరింత దారుణంగా మారింది. ప్రస్తుతం ఈ పనిభారమంతా గ్రామ పంచాయతీ కార్యదర్శులపైనే పడింది.

జిల్లాలో 499 గ్రామ పంచాయతీలు

జిల్లాలో 499 గ్రామపంచాయతీలున్నాయి. అందులో చిన్న గ్రామ పంచాయతీలు 270, మధ్య తరహా 100, మేజర్ పంచాయతీలు 129 ఉన్నాయి. పంచాయతీలకు 24 నెలలుగా ఎస్ఎఫ్‌సీ నిధులు, 4 నెలలుగా కేంద్ర ఆర్థిక సంఘం నిధులు విడుదల కాలేదు. గ్రామాల్లో పారిశుధ్యంతోపాటు, ట్రాక్టర్ నిర్వహణ, కరెంటు బల్బుల ఏర్పాటు నుంచి, తాగునీటి సరఫరా వరకు ప్రతీ పంచాయతీలో సిబ్బంది లేనిదే, కార్యదర్శులకు పాలన నిర్వహణ సాధ్యం కాదు. జిల్లా మొత్తంలో 1250 మంది మల్టీపర్పస్ పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. గ్రామ పంచాయతీలకు పన్నుల రూపంలో వసూలు అయ్యే ఆదాయం కూడా అంతంతమాత్రంగా ఉండటంతో 9 నెలలుగా సిబ్బందికి జీతాలను కూడా ఇవ్వలేకపోయారు. చాలీచాలని జీతంతో బతికే తమకు జీతం లేకుంటే ఇళ్లు ఎలా గడిచేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తుండడంతో కార్యదర్శులకు సమస్యగా మారింది. జీతాలు లేనిదే పనిచేయలేమని తేల్చిచెబుతుండడంతో కార్యదర్శులు సిబ్బందిని సముదాయించలేకపోతున్నారు.

ట్రాక్టర్ నిర్వహణకు చిల్లగవ్వ లేదు

గ్రామాల్లో చెత్తను తొలగించేందుకు ఏర్పాటు చేసిన ట్రాక్టర్ నిర్వహణ కూడా భారంగా తయారైంది. ట్రాక్టర్‌లో డీజిల్‌కు నెలనెలా చిన్న పంచాయతీలకు రూ.5 వేలు, మేజర్ పంచాయతీలకు రూ.15 వేల వరకు వెచ్చించాల్సి వస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను విడుదల చేయకపోవడంతో వాటి నిర్వహణ కష్టంగా మారింది. కార్యదర్శులు అప్పు చేసి ట్రాక్టర్‌లను నడిపిస్తున్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌లకు జీతాలు లేకపోవడంతో బతిమిలాడి పనిచేయించుకుంటున్నారు. అంతేకాకుండా ట్రాక్టర్లపై ఉన్న రుణం తీర్చడానికి బ్యాంకులకు ఈఎంఐ కింద రూ.15వేల నుంచి 21 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. చాలా గ్రామ పంచాయతీలు నాలుగు నెలలుగా వివిధ బ్యాంకుల్లో ఉన్న ట్రాక్టర్ రుణం చెల్లించనే లేదు.

24 నెలలుగా చెల్లించని కరెంటు బిల్లులు

గ్రామ పంచాయతీలో ప్రతీ నెలా చెల్లించాల్సిన కరెంటు బిల్లులు ఇప్పటివరకు చెల్లించలేదు. వీధి దీపాలకు, నీటి సరఫరా మోటార్ల విద్యుత్ చార్జీలు చెల్లించలేని దయనీయ స్థితి నెలకొన్నది. మేజర్ గ్రామ పంచాయతీలకు రూ.15వేల నుంచి 30 వేల వరకు నెలసరి కరెంటు బిల్లు వస్తుంది. బిల్లు బకాయి పడడంతో విద్యుత్‌శాఖ నుంచి పంచాయతీ కార్యదర్శులకు ఒత్తిడి తప్పడంలేదు.

వర్షాకాలంలో ముందస్తు చర్యలేలా?

ఇప్పటికే వర్షాలు ప్రారంభమయ్యాయి. వానాకాలంలో గ్రామాల్లో ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలను అధికారులు దృష్టి సారించడం లేదు. ఇప్పటికే మురుగు కాల్వలను బాగు చేయాల్సిన అధికారులు నిధులు లేక చేతులేత్తేశారు. అంతేగాక దోమల నివారణ చర్యలు, బ్లీచింగ్ చేయడం నిలిచిపోయింది. పారిశుధ్యం లేక గ్రామాలల్లో అతిసారా, డయేరియా లాంటి వ్యాదులు పొంచి ఉన్నాయనే భయం నెలకొంది. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలకు ప్రభుత్వం సమాయత్తం కాకపోవడంతో స్థానికంగా కార్యదర్శులకు ప్రజల నుంచి తిప్పలు తప్పేలా లేవు. పట్టించుకోవాల్సిన ప్రతేకాధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో జోరువాన

- నేలకొరిగిన చెట్లు.. తడిసిన ధాన్యం
- అత్యధికంగా కౌడిపల్లిలో 4.2 సెంటిమీటర్ల వర్షం


శివ్వంపేటలో వర్షానికి తడుస్తున్న ధాన్యం కుప్పలు

మెదక్ అర్బన్/సంగారెడ్డి టౌన్, మే 19: ఉమ్మడి మెదక్ జిల్లాలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు పలుప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. కల్లాల్లో ధాన్యం తడిసిపోయింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కౌడిపల్లిలో అత్యధికంగా 4.2 సెంటిమీటర్ల వర్షం కురిసింది. చిప్పల్‌తుర్తిలో 2.7 సెం.మీ., నాగపూర్‌లో 2.4 సెం.మీ., పాపన్నపేటలో 1.8 సెం.మీ., శివ్వంపేటలో 1.5 సెం.మీ., సంగారెడ్డి జిల్లా అన్నసాగర్‌లో 3.6 సెం.మీ., ఆల్మాయిపేటలో 2.8 సెం.మీ., వట్పల్లిలో 2.3 సెం.మీ., కోహిర్‌లో 2.0 సెం.మీ., ద్విగాల్‌లో 1.3 సెం.మీ., సిద్దిపేట జిల్లా కొండకండ్లలో 1.5 సెం.మీ.ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షంతో పలు ప్రాంతాల్లో రోడ్లు చెరువులను తలపించాయి. పలు గ్రామాల్లో వర్షానికి కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. ఈదురుగాలు, వర్షం కారణంగా జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో మూడు గంటల పాటు కరెంటు సరఫరా నిలిచిపోయింది.

మెదక్ చర్చిలో సందడి


చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న భక్తులు


దైవసందేశం చెబుతున్న ప్రెసిబిటరీ ఇన్‌చార్జి

మెదక్ కల్చరల్, మే 19 : మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం సందడి నెలకొన్నది. ఇన్‌చార్జి బిషప్ రెవరెండ్ డాక్టర్ కె.రుబెన్‌మార్క్ ఆధ్వర్యంలో శిలువ అరాధన అనంతరం ప్రార్థనలు నిర్వహించి భక్తులకు దైవసందేశాన్ని వినిపించారు. వేసవి సెలవులు, వాతావరణం చల్లబడటంతో ప్రార్థనా మందిరం, పరిసరాలు కిక్కిరిసాయి. ప్రార్థనల్లో ప్రెసిబిటరీ ఇన్‌చార్జి శాంతయ్య, రెవరెండ్ కె. ప్రిస్కిల్లరూబెన్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.


అక్కన్నపేటలోని చెరువులో మట్టిని తవ్వి ట్రాక్టర్‌లో పోస్తున్న కూలీలు

చెరువు మట్టితో పోషకాలు పుష్కలం

- సేంద్రియ ఎరువువలే ఉపయోగం
- చీడపీడల ప్రమాదం తక్కువే
- ఉపాధిహామీ ద్వారా తవ్వించి పొలాలకు తరలింపు

పంటపొలాల్లో సారం రోజురోజుకూ తగ్గిపోతోంది. రసాయన ఎరువుల వాడకాన్ని క్రమంగా తగ్గిస్తూ, భూమి సహజ గుణాన్ని కోల్పోకుండా పోషక విలువలు కలిగిన చెరువు మట్టిని పొలాల్లో వేస్తే ఎంతో ప్రయోజనం. ఉపాధి హామీ ద్వారా వివిధ చెరువుల్లో పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. ఈ చెరువు మట్టిని రైతులు ట్రాక్టర్ల ద్వారా పంటపొలాల్లో పోసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు...

7


రైతు పొలంలో పోసిన చెరువు మట్టి

పచ్చిరొట్టతో అధిక దిగుబడి

- భూసారం పెంపునకు దోహదం
- ఎకరానికి 15 కిలోల విత్తనాలు అవసరం
- సారవంతమైన భూమిని అందించే ఎరువు
- జీలుగ విత్తన సాగుకు ఆసక్తి చూపుతున్న రైతులు

7


పచ్చిరొట్ట సాగు(ఫైల్)

నాచగిరి క్షేత్రంలో నృసింహ జయంత్యుత్సవాలు

- ఘనంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం
- భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం


నృసింహ జయంతి సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వర్గల్, మే 19 : జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వర్గల్ మండలం నాచారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో నృసింహ జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో సాయంత్రం ఆలయ పండితుల వేద మంత్రోశ్చారణల మధ్యన విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురార్పణం, నివేదన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం సెలవు రోజు కావడంతో నాచగిరి క్షేత్రానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విరామం లేకుండా భక్తులు ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచారించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారి దర్శనానికి క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. ఆలయ మండపంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు ఘనంగా జరిగాయి. భక్తులు కుటుంబసమేతంగా వ్రతమండపానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతమాచరించారు. వేడుకల సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తిపారవశ్యమయ్యాయి.

21 వరకు జయంత్యుత్సవాలు

నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రారంభమైన నృసింహ జయంత్యుత్సవాలు 21 వరకు నిర్వహించనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.అన్నపూర్ణ తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాలకు కావలసిన ఏర్పాట్లు చేశామన్నారు. సోమవారం ఉదయం 8.00 గంటలకు యాగశాల ప్రవేశం, మూర్తికుంభ స్థాపన, అగ్నిప్రతిష్ఠ, మూల మంత్రహవనం, పూర్ణహుతి, మంగళవారం ఉదయం 8.00 గంటలకు మూల మంత్ర హవనం, సాయంత్రం భక్తజనులతో సామూహిక కుంకుమార్చన, బుధవారం మూల మంత్ర హవనం, మహాపూర్ణాహుతి, మూలవరులకు శతఘటాభిషేకం, నివేదన, తీర్థ ప్రసాద వితరణ సాయంత్రం 6.00 గంటలకు నృసింహ విర్భావము నివేదన తదితర పూజా కార్యక్రమాలతో వేడుకలు ముగిస్తాయని తెలిపారు.




స్వామివారి నిత్యకల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు, ఆలయ గంగిరేగుచెట్టు ప్రాంగణంలో భక్తజనసందోహం

మల్లన్న ఆలయంలో భక్తజనసందోహం

చేర్యాల, మే 19 : కొమురవెల్లి మల్లన్న ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు మొక్కుబడి తలనీలాలు సమర్పించి ఆలయ కోనేటిలో స్నానమాచరించారు. సంప్రదాయబద్ధంగా మట్టి కుండలో బోనం చేసి భక్తిప్రపత్తులతో చలక, నజరు, ముఖమండప పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. మల్లన్నను దర్శించుకుని ఒడిబియ్యాలు పోసి వేడుకున్నారు. ఎల్లమ్మదేవతకు బోనం నివేదించి, కల్లు, బెల్లంపానకం సాక పెట్టి ఒడిబియ్యాలు పోశారు. ప్రత్యేక, ఉచిత ధర్మదర్శనం క్యూలైన్లల్లో రద్దీ కొనసాగడంతో స్వామివారి దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. అలాగే పట్నాలు వేసిన భక్తులతో ముఖమండపం, గంగిరేగుచెట్టు ఆలయ ప్రాంగణాలు సందడిగా మారింది. తమ కోర్కెలను నెరవేర్చమని వేడకుంటూ ఆలయ ప్రాంగణంలోని గంగిరేగుచెట్టుకు ముడుపులు కట్టారు. ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో ఏఈవో బుద్ది శ్రీనివాస్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

'ఐటీఐ'తో ఉపాధికి ఊతం

- ఆన్‌లైన్‌లో ప్రవేశాలు షురూ
- మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు



సంగారెడ్డి అర్బన్, మే 19 : పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)ల్లో ప్రవేశాలకు ప్రకటన వెలువడింది. ఆసక్తి ఉన్న విద్యార్థులు జూన్ 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. 8, 10వ తరగతుల్లో పొందిన మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పించనున్నారు. ప్రస్తుతం విస్తరిస్తున్న పరిశ్రమలు, ఇతర రంగాల్లో ఉపాధి పొందేందుకు నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి సాంకేతిక విద్య ఉపయోగపడుతుంది.

ఆన్‌లైన్‌లో సీట్ల కేటాయింపు

విద్యార్థులు ముందుగా ఐటీఐ.తెలంగాణ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు నమోదు చేసుకోవాలి. 8, పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు అవకాశం ఉంటుంది. దరఖాస్తు ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లో మాత్రమే అందుబాటులో ఉంటుంది. 14 సంవత్సరాలు నిండినవారు పారిశ్రామిక శిక్షణ సంస్థలో చదివేందుకు అర్హులు. ఆధార్‌కార్డులో పేరు, పుట్టిన తేదీ పదో తరగతి మెమో ప్రకారం ఉండాలి. విద్యార్హత, కుల ధ్రువీకరణ, ఆధార్ కార్డులను దరఖాస్తు సమయంలో స్కానింగ్ చేసి అప్‌లోడ్ చేయాలి. ఆన్‌లైన్ దరఖాస్తులోనే ట్రేడ్‌లను ఎంపిక చేసుకోవాలి. పదో తరగతి మార్కులు, గ్రేడ్లు, రిజర్వేషన్ల ఆధారంగా దరఖాస్తు సమయంలో ఇచ్చిన ఫోన్ నంబర్‌కు కోర్సు, సీటు కేటాయింపుపై సమాచారం ఇస్తారు.

ఉపాధి అవకాశాలు

పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో వివిధ ట్రేడ్లలో శిక్షణ పొందినవారు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధిని పొందవచ్చు. అంతే కాకుండా స్వయం ఉపాధి అవకాశాలు ఉంటాయి. విద్యార్థులు తక్కువ సమయంలో ఉపాధి పొందే అవకాశం సాంకేతిక విద్య అందిస్తుంది.

- కె.రాజేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఐటీఐ, సంగారెడ్డి

అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు

- మనోహరాబాద్‌లో చెరువుకు సమీపంలో ఆఫీసులు
- ఆ మార్గంలో ఏటా ప్రవహిస్తున్న వరద నీరు
- ఇబ్బందులు పడుతున్న అధికారులు, సిబ్బంది

మనోహరాబాద్, మే 20: గత ప్రభుత్వ హయాంలో నూతన జిల్లాలు, మండలాల ఏర్పాటు జరిగింది. కానీ ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించకపోవడంతో అద్దె భవనాల్లో అరొకర వసతులతోనే కార్యాలయాలు కొనసాగుతున్నాయి. దీంతో అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. 2017లో మెదక్ జిల్లాలో మనోహరాబాద్ కేంద్రంగా నూతన మండలం ఏర్పడింది. మండల కేంద్రంలో ప్రభుత్వ ఆఫీసులు లేకపోవడంతో పోలీస్ స్టేషన్, ఎంపీడీవో కార్యాలయాలు అద్దె భవనాల్లో అరకొర వసతులతో కొనసాగుతున్నాయి. మనోహరాబాద్‌లోని రామాయపల్లి చెరువును ఆనుకుని పక్క పక్కనే ఉన్న భవనాలను అద్దెకు తీసుకుని రెండు కార్యాలయాలను నిర్వహిస్తున్నారు. ఏటా వర్షాకాలంలో మనోహరాబాద్ పెద్దచెరువు నిండి ఆ కార్యాలయాలకు వేళ్లే దారి మీదుగా రామాయపల్లి చెరువులోకి నీరు వెళ్తుంది. భవనాల చుట్టూ పూర్తిగా నీరు నిలిచిపోతుంది.



అద్దె భవనంలో కొనసాగుతున్న మనోహరాబాద్ పోలీస్ స్టేషన్

దీంతో పోలీస్ స్టేషన్‌తోపాటు ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే అధికారులు, సిబ్బందితో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మనోహరాబాద్ పెద్దచెరువు నిండినప్పుడల్లా రెండు కార్యాలయాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో పనులు జరగగ ప్రజలు, విధులు నిర్వర్తించలేక ప్రభుత్వ సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. వానాకాలంలో ఏదైనా వాహనం ఉంటేనే ఆయా కార్యాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. నడుచుకుంటూ వేళ్లేందుకు ప్రయత్నిస్తే వరద నీటికి పూర్తిగా తడిసి ముద్దవ్వాల్సిందే. అయితే ప్రభుత్వాలు మారినా సొంత భవనాలు మాత్రం సమకూరడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మనోహరాబాద్ మండలంలో సొంత కార్యాలయాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వ సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.


ఆఫీసుకు వెళ్లే దారిపై నిలిచిన వరద నీటిలో నడుచుకుంటూ వెళ్తున్న ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది(ఫైల్)

పోలీస్ స్టేషన్ కోసం అధికారులు స్థలాన్ని గుర్తించారు



నేను మనోహరాబాద్‌లో 10 నెలలుగా విధులు నిర్వర్తిస్తున్నాను. పోలీస్ స్టేషన్ అద్దె భవనంలో కొనసాగుతుండడంతో అరకొర వసతులతోనే వెళ్లదీస్తున్నాం. గతంలో ఉన్నత అధికారులు, ఎస్పీ వచ్చి మనోహరాబాద్, కూచారం, ముప్పిరెడ్డిపల్లి గ్రామాల్లో పోలీస్ స్టేషన్ ఏర్పాటు కోసం ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. చివరిసారిగా ముప్పిరెడ్డిపల్లి శివారులోని జాతీయ రహదారి పక్కన ఉన్న స్థలాన్ని పరిశీలించారు.

- కరుణాకర్‌రెడ్డి, ఎస్ఐ, మనోహరాబాద్

ప్రారంభానికి నోచని ఆరోగ్య స్వస్థత కేంద్రాలు

- గత ప్రభుత్వ హయాంలో ఆగమేఘాల మీద నిర్మాణం

మాసాయిపేట, మే 20: ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో పలు మండల కేంద్రాల్లో ఆయుర్వేద ఆస్పత్రుల ఆవరణలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరోగ్య స్వస్థత కేంద్రాలను నిర్మించింది. కానీ రెండేళ్లవుతున్నా ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. గ్రామీణ మహిళలకు, వృద్ధులకు ఉపయోగకరంగా యోగా కేంద్రాల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వ నిధులు ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ఆరోగ్య స్వస్థత కేంద్రాలకు నిధులు వెచ్చించింది. ఆ మేరకు రెండేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన స్వస్థత ఆరోగ్య కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. నిర్మాణం పూర్తయి రెండేళ్లవుతున్నా ప్రారంభానికి నోచుకోలేదు. అధికారుల నిర్లక్ష్యంతో సరైన ప్రణాళిక లేకుండానే ఆరోగ్య స్వస్థత కేంద్రాలను నిర్మించి నిర్లక్ష్యంగా వదిలివేశారు. ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ ద్వారా ఎంతో మహోన్నతంగా చేపట్టిన స్వస్థత కేంద్రాల్లో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.




మెదక్ జిల్లా మాసాయిపేట మండల కేంద్రంలో రెండేళ్లుగా ప్రారంభానికి నోచుకోని ఆరోగ్య స్వస్థత కేంద్రం

అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలి


లింగుపల్లిలో మాట్లాడుతున్న డీబీఎఫ్ నాయకులు

మిరుదొడ్డి, మే 19: ఏపీలోని తిరుపతి జిల్లా వెంకటగిరిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం మిరుదొడ్డి మండలం లింగుపల్లి గ్రామంలో డీబీఎఫ్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసి వారం రోజులు అవుతున్నా ఇప్పటివరకు నిందితులను పట్టుకోకపోవడం సిగ్గుచేటన్నారు. నిందితుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైందికాదన్నారు. నిందితులను త్వరగా పట్టుకుని, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే దళిత సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు. ఆయన వెంట డీబీఎఫ్ నాయకులు కిరణ్, చందు, శంకర్ తదితరులున్నారు.

అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన బైక్

- ఒకరికి తీవ్ర గాయాలు

కుకునూరుపల్లి, మే 19: బైకు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కుకునూరుపల్లి గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఏపీలోని అనంతపురం జిల్లాకు చెందిన ప్రతాప్ హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు పరిశ్రమలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం హుస్నాబాద్ మండలం మీర్జాపూర్‌లో బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్లి హైదరాబాద్ తరిగి వెళ్తుండగా కుకునూరుపల్లి శివారులో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రతాప్ తలకి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని ప్రథమ చికిత్స అందించి ప్రతాప్‌ను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

నారాయణఖేడ్: మండల కేంద్రమైన నిజాంపేట సమీపంలో మూలమలుపు వద్ద ఆదివారం ద్విచక్రవాహనం అదుపు తప్పి ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట మండలం నాగ్‌ధర్ గ్రామానికి చెందిన బోయి దుర్గయ్య(27) తన బైక్‌పై నిజాంపేట వైపు నుంచి ఖేడ్ వైపు 161బీ జాతీయ రహదారిపై వెళ్తున్నాడు. నిజాంపేట సమీపంలోని మూలమలుపు వద్ద వాహనం అదుపు తప్పడంతో కిందపడి దుర్గయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో ఖేడ్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పాఠశాలల్లో విద్యావలంటీర్లు, స్కావెంజర్లను నియమించాలి

సంగారెడ్డి అర్బన్, మే 19: పాఠశాలల ప్రారంభానికి ముందే ప్రభుత్వ బడులల్లో విద్యావలంటీర్లు, స్కావెంజర్లను నియమించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సాబేర్‌అలీ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని స్థానిక కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ పూర్తి చేసి పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలన్నారు. గత కొనేళ్లుగా పాలకుల నిర్లక్ష్యం కారణంగా విద్యారంగం పూర్తిగా నిర్వీర్యమైందని ఆరోపించారు. బడులు తెరిచే నాటికి యూనిఫామ్స్, నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రాథోడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌కుమార్, కార్యదర్శులు హఫీజ్, జీవన్‌రాథోడ్, జిల్లా ఆర్థిక కార్యదర్శి రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సాబేర్‌అలీ

పచ్చిరొట్టతో అధిక దిగుబడి

- భూసారం పెంపునకు దోహదం
- ఎకరానికి 15 కిలోల విత్తనాలు అవసరం
- మొక్కలకు సారవంతమైన భూమిని అందించే ఎరువు
- జీలుగ విత్తన సాగుకు ఆసక్తి చూపుతున్న రైతులు

సిద్దిపేట అగ్రికల్చర్, మే 19: పంట దిగుబడిలో పచ్చిరొట్ట ప్రధాన భూమిక పోషిస్తుంది. భూసారం పెంపును దోహదపడుతుంది. భూముల్లో రేగడి మట్టి పోసేకంటే నేల స్వభావానికి అనుగుణంగా పచ్చిరొట్ట ఎరువు సాయంతో సార వంతంగా మార్చుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. పశువుల పేడకంటే పచ్చిరొట్ట పది రెట్లు భూమిని ఎక్కువ సారవంతం చేస్తుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. నత్రజని, భాస్వరం వాడకం కూడా తగ్గుతుందని, అంతేగాక నాణ్యమైన పంట దిగుబడి వస్తుందని చెబుతున్నారు. పచ్చిరొట్ట అనుకున్న ఫలితాలు ఇస్తుండడంతో గ్రామాల్లో రైతులు ఈ పంట సాగుపై ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ఇందులో జీలుగ సాగు చక్కటి ఫలితాలు ఇస్తున్నది. నేల స్వభావాన్ని బట్టి జీలుగ సాగు చేసుకుంటే ఆపై వేసే పంటలకు అనుకూలంగా ఉంటుంది. పచ్చిరొట్ట ఎరువుల కోసం నిర్దేశించిన మొక్కలను పొలంలో కలియదున్నడం వల్ల అవి కుళ్లి మొక్కలకు సారవంతమైన భూమిని అందిస్తుంది. జీలుగ పూతదశకు రాగానే నేలలో కలియదున్నితే అత్యధిక పరిమాణాల్లో నేలకు పోషకాలు అందుతాయి. జీలుగ విత్తనాలు క్వింటాలుకు అసలు ధర రూ.9,300 ఉండగా సబ్సిడీ కింద రూ.3,720 చెల్లించి పొందవచ్చు. 30 కిలోల జీలుగ విత్తనాల బస్తాకు ధర రూ.1,116 చెల్లించి పొందవచ్చు.

పచ్చిరొట్ట సాగుపై దృష్టి సారించాలి



పచ్చిరొట్టతో వ్యవసాయ భూమి సారవంతంగా తయారవుతుంది. గ్రామాల్లోని రైతులు పచ్చిరొట్ట సాగుపై దృష్టి సారించాలి. కలుపు మొక్కలను నివారించడానికి, భూసారం పెరగడానికి రైతులు విధిగా పచ్చిరొట్ట సాగు చేయాలి. పచ్చిరొట్ట ఎరువుతో గింజ గట్టిగా ఉంటుంది. ప్రతికూల పరిస్థితులను తట్టుకొని నిలబడుతుంది. రసాయనిక ఎరువుల వాడకం తగ్గడంతో ఆరోగ్యకర ఉత్పత్తులను సాధించవచ్చు.

– శివప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, సిద్దిపేట

అందుబాటులో జీలుగ విత్తనాలు



అన్ని గ్రామాల్లోని రైతులు పచ్చిరొట్ట సాగుపై ఆసక్తి చూపాలి. రైతులకు కావాల్సిన జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న జీలుగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి. జీలుగ సాగుతో రైతులు సహజసిద్ధంగా భూసారాన్ని పెంచుకొని లబ్ధిపొందాలి. సబ్సిడీ పోగా రైతుకు 30 కిలోల జీలుగ విత్తనాలు రూ.1,116లకే అందజేస్తున్నాం.

– పరుశురాంరెడ్డి, ఏవో, సిద్దిపేట



ఎన్సాన్‌పల్లిలో జీలుగ విత్తనాల సంచులను రైతులకు అందజేస్తున్న ఏవో పరుశురాంరెడ్డి



నంగునూరు మండలం ముండ్రాయిలో జీలుగ విత్తనాల కోసం ఏఈవో వద్ద పేర్లు నమోదు చేసుకుంటున్న రైతులు

25 నుంచి 30 రోజుల్లోనే ఎరువు తయారీ

ఏకవర్షిక మొక్కల్లో ప్రథమ స్థానం జీలుగదే. మొక్కలు నాటిన 25 నుంచి 30 రోజుల్లోనే పంట ఏపుగా పెరుగుతుంది. ఎకరానికి 15 కిలోల విత్తనాల అవసరం ఉంటుంది. బిందుసేద్యం ద్వారా అయితే సాళ్లల్లో విత్తుకోవాల్సి ఉంటుంది. మొక్కలు బాగా పెరిగేందుకు క్రమపద్ధతిలో నీటి తడులు ఇవ్వాలి. 25నుంచి 30 రోజులకు మొక్కలు ఏపుగా పెరిగి పూతదశకు చేరుకుంటాయి. అనంతరం భూమిని రోటోవేటర్ సహాయంతో కలియదున్నాలి. దున్నిన అనంతరం 100 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్‌ను దుక్కిలో వేయాలి. సూపర్ పాస్ఫేట్ వల్ల మొక్కల అవశేషాలు బాగా కుళ్లి పచ్చిరొట్ట ఎరువు తయారవుతుంది. కుళ్లే దశలో నీటిని సక్రమంగా అందించాల్సి ఉంటుంది. పచ్చిరొట్ట ఎరువులకు ముఖ్యంగా జీలుగ, జనుము, వాటిని రైతులు ఎక్కువగా ఉపయోగిస్తారు. రైతులు జీలుగ సాగుకే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు.

పచ్చిరొట్ట సాగులో మెళకువలు

ప్రధాన పంట కోయగానే నేలలో మిగిలిన తేమను సద్వినియోగపరచుకొని పచ్చిరొట్ట ఎరువులు విత్తుకోవాలి. తేమ చాలని ప్రాంతాల్లో వేసవిలో దుక్కి దున్ని తొలకరి వర్షాలు పడగానే విత్తుకోవాలి. నీటి వసతి కలిగిన ప్రాంతాల్లో వేసవిలో సాగు చేయడం లాభదాయకం. రెండు పంటల మధ్య కాల వ్యవధిలో విత్తుకొని కలియ దున్నవచ్చు.

పచ్చిరొట్టతో కలిగే లాభాలు ఇవే

- పొలంలో జీలుగను కలియదున్నిన తర్వాత అవి నేలకు, ఆపై వేసే పంటకు విశేషమైన లాభాలు అందిస్తుంది. ప్రధాన పంటకు ముందస్తుగా నేలను తయారు చేస్తుంది. మొక్కలకు 2 శాతం నత్రజని, సూపర్‌పాస్ఫేట్‌ను అదనంగా అందుతుంది. జింక్, మాంగనీస్, ఇనుము, కాల్షియం వంటి సూక్ష్మధాతువులను పంటకు చేకూర్చుతాయి.
- నేలలో కరగని మూలకాలను పంటకు అనుకూలంగా మార్చుతాయి. నీటి నిల్వ సామర్థ్యం పెంచుతుంది. నేల సహజ మిత్రులైన వానపాముల ఉత్పత్తికి దోహదం చేస్తాయి. లెగ్యూం జాతికి చెందిన మొక్క కావడంతో వేర్లల్లో నత్రజని స్థిరీకరణ అధికంగా ఉంటుంది. కలుపు మొక్కలను అడ్డుకుంటుంది. నేల భౌతిక స్థితి (నేల ఆకృతి) మెరుగుపడి, భూమి గుల్లగా మారి నేలలోనికి నీరు ఇంకే గుణం పెరుగుతుంది.
- నేలలో సేంద్రియ పదార్థం వేయడం వల్ల సూక్ష్మ జీవులు వృద్ధి చెందుతాయి. జీవ రసాయన చర్యలతో నేల సారం పెరుగడమే కాక, నేల సంపూర్ణ ఆరోగ్యాన్ని సంతరించుకొని ఉత్పాదకత సామర్థ్యాన్ని పెంచుకుంటుంది.
- నేలలో క్లిష్ట (లభ్యం కాని) రూపంలో ఉన్న అనేక పోషకాలను లభ్య రూపంలోకి మారుస్తాయి. భూమిలో రసాయన ఎరువులు వేసినప్పుడు వాటి లభ్యత పెరగడానికి హరిత ఎరువులు ఉపయోగపడుతాయి. కలుపు మొక్కలు పెరుగకుండా నివారించవచ్చు.
- జీలుగ, సీమ జీలుగ వంటి హరిత పైరులు వేసినప్పుడు వాటి వేళ్లు ఎక్కువ లోతుకు వెళ్లడం వల్ల భూమి లోపలి పొరల్లో నిక్షిప్తమైన అనేక పోషకాలను వెలికి తెచ్చి లభ్య రూపంలో పంటలకు అందిస్తాయి.
- చౌడు భూముల పునరుద్ధరణకు ఉపయోగపడుతాయి. భాస్వరం, గంధకం వంటి పోషకాల లభ్యత గణనీయంగా ఉంటుంది. సూక్ష్మ పోషకాలను పంట మొక్కలకు అందేటట్లు చేస్తాయి.
- పశువుల మేతగానూ ఉపయోగపడుతాయి.

280 క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టివేత



మాడ్గి చెక్‌పోస్టు వద్ద బియ్యాన్ని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

జహీరాబాద్, మే 19: హైదరాబాద్ నుంచి సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మీదుగా గుజరాత్‌కు అక్రమంగా తరలిస్తున్న 280 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని మొగుడంపల్లి మండలంలోని మాడ్గి చెక్‌పోస్టు వద్ద టాస్క్‌ఫోర్స్, సివిల్ సప్లయ్ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. నమ్మదగ్గ సమాచారం మేరకు గుజరాత్‌కు చెందిన ముకవన్ గిరిధర్‌బాయి, గుంటురు జిల్లా పత్తిచెరుకురీ మండలంలోని రైస్‌ట్రేడర్ కమలపతి శ్రీనివాస్ కలిసి లారీలో గుజరాత్‌కు రేషన్‌బియ్యాన్ని తరలిస్తుండగా.. టాస్క్‌ఫోర్స్ పోలీసులు, చిరాగ్‌పల్లి ఎస్‌ఐ నరేష్, సివిల్‌సప్లయ్ అధికారులు మాడ్గి చెక్‌పోస్టు వద్ద మాటువేసి పట్టుకున్నారు. అందులో 1,120 ప్లాస్టిక్ బ్యాగులుండగా వాటి విలువ సుమారు రూ.3.36 లక్షల వరకు ఉంటుందన్నారు. సివిల్‌సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ సాయిరవి ఫిర్యాదు మేరకు మేరకు బియ్యాన్ని, లారీని, లారీ డ్రైవర్, రైస్‌ట్రేడర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

అంతర్జాతీయ న్యూరో సదస్సుకు కృష్ణమూర్తి



కృష్ణమూర్తి

సంగారెడ్డి అర్బన్, మే 19: అంతర్జాతీయ న్యూరో సదస్సులో ప్రసంగించేందుకు సంగారెడ్డి చౌరస్తా సమీపంలోని హోప్ న్యూరో అండ్ కార్డియాక్ ఆస్పత్రి అధినేత, న్యూరో సర్జన్ కృష్ణమూర్తికి ఆహ్వానం అందింది. ఐరోపా ఖండంలోని నెదర్లాండ్స్ రాజధాని ఆంమ్స్టర్‌డామ్ నగరంలో ఈ నెల 27 నుంచి 29వరకు జరగనున్న ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ న్యూరో సైన్స్ అండ్ బ్రెయిన్ డిజార్డర్స్ అనే అంతర్జాతీయ సదస్సులో ప్రసంగించేందుకు ఆయనకు అవకాశం లభించింది. గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ వేదికపై ప్రసంగించేందుకు వెళ్తున్న సందర్భంగా కృష్ణమూర్తిని ఆస్పత్రి సిబ్బంది, కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు అభినందించారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పెళ్లింట తీవ్ర విషాదం

- రోడ్డు ప్రమాదంలో వరుడి అన్న మృతి



ప్రమాద స్థలంలో పడివున్న క్షతగాత్రుడు, బైక్



నర్సింహులు (ఫైల్)

తూప్రాన్, మే 19: సంతోషంగా పెళ్లి జరగాల్సిన ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. పెళ్లికొడుకు అన్న మృతిచెందడంతో పెళ్లిబాజాలకు బదులు చావుడప్పులు మోగడం అందరినీ కలిచివేసింది. పెళ్లి ఏర్పాట్లలో ఉన్న వరుడి సోదరుడు ప్రమాదానికి గురై, మృతిచెందాడు. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ మండలం యావాపూర్ వద్ద ఆదివారం జరిగింది. గ్రామస్థులు, తూప్రాన్ ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం అనంతగిరిపల్లికి చెందిన కర్రె జోయల్(సాయి) వివాహం మంగళవారం జరగాల్సి ఉంది. జోయల్ పెళ్లి ఏర్పాట్లను అన్న కర్రె నర్సింహులు(40) చూస్తున్నాడు. అందులో భాగంగా మేడ్చల్ జిల్లాకు చెందిన బావ పోచయ్యతో కలిసి నర్సింహులు ద్విచక్ర వాహనంపై తూప్రాన్ నుంచి స్వగ్రామమైన అనంతగిరిపల్లికి బయలుదేరాడు. అదే సమయంలో వారితోపాటే వరికోత పనులు చేస్తున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన మోహన్, సతీష్‌కుమార్ మరో ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. గజ్వేల్ - తూప్రాన్ రోడ్డుపై వెళ్తుండగా తూప్రాన్ మండలం యావాపూర్ శివారులో ఎదురుగా వచ్చిన ట్రక్కు రెండు బైకులను ఢీకొట్టింది. దీంతో బైకులపై ఉన్న నలుగురు ఎగిరి దూరంగా పడిపోయారు. గాయపడిన నలుగురిని చికిత్సకు తరలించగా, చికిత్స పొందుతూ కర్రె నర్సింహులు(40) మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన ముగ్గురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తూప్రాన్ ఎస్‌ఐ శివానందం వివరించారు.

కల్లాలను తలపిస్తున్న గ్రామీణ రోడ్లు

- రహదారులపై ప్రమాదకరంగా వడ్ల కుప్పలు



చెన్నపూర్‌లో రోడ్డుపై సగభాగం వరకు ప్రమాదకరంగా ఉన్న వడ్ల కుప్పలు, బండ రాళ్లు

శివ్వంపేట, మే 19: పలు గ్రామాల్లో రోడ్లపైనే ధాన్యం ఆరబోస్తుండడంతో రోడ్లన్నీ కల్లాలను తలపిస్తున్నాయి. సగభాగం రోడ్డును వడ్ల కుప్పలు ఆక్రమిస్తుండడంతో ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. రాత్రి వేళల్లో ధాన్యం కుప్పలు కనిపించక నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతున్నాయి. మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలోని చిన్న గొట్టిముక్కుల, చెన్నాపూర్, పెద్ద గొట్టిముక్కుల, గోమారం, చంది, పిల్లుట్ల, అల్లీపూర్, రత్నాపూర్ గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో రోడ్లపై ధాన్యం రాశులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రోడ్లపై ఆరబోసిన ధాన్యంపై వాహనాలు వెళ్లకుండా రోడ్డు పొడవునా పెద్దపెద్ద బండ రాళ్లు పెట్టి వెళ్లిపోవడంతో వాటిని గమనించని వాహనదారులు రాళ్లను ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. పంటలో త్వరగా తేమశాతాన్ని తగ్గించేందుకు రైతులు రహదారులపై వడ్ల కుప్పలు పోస్తుండడం వాహనదారుల పాలిట యమగండంగా మారుతున్నాయి.

కొనుగోళ్లలో రైతుల ఇబ్బందులు పట్టవా?

నర్సాపూర్, మే 19: రాష్ట్రంలో అధికారంలో వచ్చిన కాంగ్రెస్‌కు రైతుల ఇబ్బందులు పట్టవా అని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ ప్రశ్నించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలపై సరైన పర్యవేక్షణ లేకపోవడం, ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో రైతులు ఆరుగాలం పండించిన ధాన్యం అమ్ముకోవడానికి నానాతంటాలు పడాల్సి వస్తుందన్నారు. నర్సాపూర్ పట్టణంలోని మార్కెట్‌యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో రైతులు ధాన్యంతో రోజుల తరబడి నిరీక్షిస్తున్నా వారిగురించి పట్టించుకోకపోవడం దారుణమన్నారు. స్థానిక మిల్లులకు కాకుండా ఇతర జిల్లాల వారికి ఇక్కడి ధాన్యం కేటాయించడంతో వారు ఆ ధాన్యం నిరాకరిస్తున్నారని చెప్పారు. దీంతో అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లోని ధాన్య తడిసి రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి స్థానిక మిల్లులకే ధాన్యం అప్పగించేలా చూసి రైతులను ఆదుకోవాలని కోరారు.

చెరువు మట్టితో పోషకాలు పుష్కలం

- సేంద్రియ ఎరువువలె ఉపయోగం
- చీడపీడల ప్రమాదం తక్కువ
- ఉపాధి హామీ పథకం కింద పొలాలకు తరలింపు

అక్కన్నపేట, మే 19: చేనుకు చేవ చెరువు మట్టి. చెరువులోని సారవంతమైన మట్టిలో ఎన్నో పోషకాలు ఉంటాయి. ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు చెరువు మట్టిని ప్రభుత్వం అందజేస్తున్నది. ఉపాధి హామీ కూలీలు చెరువులో మట్టిని తవ్వి, రైతులు తెచ్చుకున్న ట్రాక్టర్‌లలో ఎత్తి పోస్తున్నారు. చెరువు మట్టిని పొలాల్లో పోయడం ద్వారా రసాయన ఎరువులు వాడాల్సిన అవసరం గణనీయంగా తగ్గుతుంది.

రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయం..

పంట ఎదుగుదలకు రైతులు విపరీతంగా ఎరువులు వాడుతున్నారు. అధిక దిగుబడులు కోసం ఎరువులు వేస్తే చీడపీడలు ఆశిస్తున్నాయి. శక్తివంతమైన పురుగు మందులను పిచికారి చేస్తున్నారు. దీంతో భూసారం కోల్పోయి దిగుబడులు రాక రైతులు అప్పుల పాలవుతున్నారు. పంటపొలాల్లో సారం రోజురోజుకూ తగ్గిపోతోంది. సేంద్రియ పదార్థాలు, సూక్ష్మ పోషకాల శాతం అంతకంతకూ పడిపోతున్నది. రసాయన ఎరువుల వాడకాన్ని క్రమంగా తగ్గిస్తూ, భూమి సహజ గుణాన్ని కోల్పోకుండా పోషక విలువలు కలిగిన చెరువు మట్టిని పొలాల్లో వేస్తే ఎంతో ప్రయోజనం ఉంటుంది. ఉపాధి హామీ పథకంలో భాగంగా వివిధ చెరువులో పూడికతీత పనులు కొనసాగిస్తున్నారు. చెరువులో కూలీలు తీసిన మట్టిని రైతులు ట్రాక్టర్ల ద్వారా పంటపొలాల్లో పోసుకుంటున్నారు.

ప్రతీ వేసవిలో మట్టిని పొలంలో పోయిస్తా



చెరువు మట్టిని పొలాల్లో పోయడం వల్ల పంటలు మంచి దిగుబడి వస్తాయి. ఎరువుకంటే ఎక్కువగా పని చేస్తుంది. గతంలో కూడా చెరువు మట్టిని పోయడం వల్ల పంటలు బాగా పండాయి. అందుకే ప్రతీ వేసవిలో చెరువు మట్టిని ఉపాధి హామీ పథకం ద్వారా పొలాల్లో పోయించుకుంటున్నాను.

– అన్నబోయిన ధనంజయ్, రైతు, గుబ్బడి



అక్కన్నపేట మండలం గుబ్బడిలో చెరువులో మట్టిని తవ్వి ట్రాక్టర్‌లో నింపుతున్న ఉపాధిహామీ కూలీలు



రైతు పొలంలో పోసిన చెరువు మట్టి

చెరువు మట్టిలో నత్రజని, భాస్వరం, పొటాషియం

సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా వర్షాధార, బోరుబావులు, కుంటాల కింద సాగయ్యే భూములు అధికంగా ఉన్నాయి. అలాంటి భూముల్లో చెరువులో పూడికతీసిన మట్టిని పోయడం వల్ల ఎన్నో లాభాలు ఉంటాయి. ఈ మట్టిలో నత్రజని, భాస్వరం, పొటాషియంతో పాటు పోషకాలు విరివిగా ఉంటాయి. అంతేకాక నేలలో తేమ శాతం తగ్గకుండా కాపాడుకోవచ్చు. నీటి నిల్వ సామర్థ్యం పెంపుతో పంటలకు మేలు కలుగుతుంది. సూక్ష్మ పోషకాలైన జింక్, ఐరన్, మాంగనీస్, కాపర్, బోరాన్ వంటివి పంటలకు రోగాల బారి నుంచి కాపాడుతాయి.

అధిక దిగుబడులు సాధించవచ్చు

చెరువు మట్టిని పంట పొలాల్లో పోయడం వల్ల మంచి దిగుబడులు పొందవచ్చు. ఈ మట్టితో భూమి గుల్లబారుడుతనం పెరిగి నాటిన మొక్కలు లోతుగా చొచ్చుకుపోతాయి. ఈ క్రమంలో వేర్లకు బలం చేకూరుతుంది. అలాగే చెరువు మట్టి మూడేళ్ల వరకు పనిచేస్తుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి

- తుర్కపల్లి జాతరలో ఆకట్టుకున్న బండ్ల ప్రదర్శన

నారాయణఖేడ్, మే 19: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండల పరిధిలోని తుర్కపల్లి భూలక్ష్మమ్మ జాతర ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది. భూలక్ష్మమ్మ తల్లి గ్రామమైన ఎల్గోయి నుంచి ఆ గ్రామస్థులు పెద్ద ఎత్తున బండ్లను తీసుకొని తుర్కపల్లి వచ్చి అమ్మవారి గుడి చుట్టూ ప్రదర్శనలు చేయించారు. కామారెడ్డి జిల్లా ధర్మారం, తదితర గ్రామాల నుంచి కూడా భక్తులు వచ్చి బండ్లను ఊరేగించారు. రాత్రి బోనాల ప్రదర్శన అట్టహాసంగా చేపట్టారు. భూలక్ష్మమ్మను దర్శించుకోవడానికి దూర ప్రాంతాల నుంచి అనేక మంది తరలి రావడంతో దేవాలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. జాతర సందర్భంగా భూలక్ష్మమ్మ అమ్మవారిని డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

లింగాపూర్‌లో వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు

నారాయణఖేడ్ మండల పరిధిలోని లింగాపూర్‌లో వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు ఆదివారం మూడవ రోజున కొనసాగాయి. ఆలయ ఆవరణలో నిత్య హోమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకొని స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో తాజామాజీ సర్పంచ్ సతీష్, ఆలయ కమిటీ సభ్యులు శ్యాం, రాధాక్రిష్ణ, ఈశ్వరప్ప, హన్మండ్లు, మాణిక్యం, భూపతి, నర్సింలు, దత్తు, తదితరులు పాల్గొన్నారు.

మక్తా భూపతిపూర్‌లో బోనాల పండుగ

మెదక్ కల్చరల్: మెదక్ మండలంలోని మక్తా భూపతిపూర్ గ్రామంలో బండ్లు, బోనాల జాతర కొనసాగుతున్నది. అందులో భాగంగా ఆదివారం గట్టు మైసమ్మకు బోనాల ఊరేగింపు నిర్వహించారు. సోమవారం నల్లపోచమ్మకు, మంగళవారం మత్తడి పోచమ్మకు బోనాల ఊరేగింపు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ జాతరను 90 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

చాముండేశ్వరీ ఆలయంలో ప్రత్యేక పూజలు

చిలప్‌చెడ్: మండల పరిధిలోని చిట్కుల్ గ్రామ శివారులో గల చాముండేశ్వరీ అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం సెలవుదినం కావడంతో హైదరాబాద్, మెదక్, బీదర్ తదితర సూదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కుంకుమార్చనలు నిర్వహించి ముడుపులు కట్టారు. భక్తులకు పూజారులు ప్రభాకర శర్మ, మోతీలాల్‌శర్మ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రేగోడులో పోలేరమ్మ దేవి బోనాలు

రేగోడు: తెలంగాణలోనే ప్రసిద్ధి చెందిన రేగోడు పోతులూరి వీరబ్రహ్మం గారి ఆరాధన ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి పోలేరమ్మ దేవికి వైభవంగా భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించారు. రేగోడు పురవీధుల గుండా భాజా, భజంత్రీలతో మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని పోలేరమ్మ ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో వీరబ్రహ్మం గారి మఠం పూజారి శివకుమార్‌చారి పాల్గొన్నారు.

మెదక్‌లో నల్లపోచమ్మ బోనాలు

మెదక్ అర్బన్: మెదక్ పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నల్లపోచమ్మతల్లికి బోనాలు సమర్పించారు. మహిళలు బోనం ఎత్తుకొని డప్పుచప్పుళ్ల మధ్య అమ్మవారి ఆలయానికి చేరుకొని బోనాన్ని నైవేద్యంగా సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు మల్లేశం, కోఆర్డినేటర్ శివ, శ్రీను, లక్ష్మణ్, రాజు, వెంకట్ పాల్గొన్నారు.



చిలప్‌చెడ్: చిట్కుల్ గ్రామ శివారులో గల చాముండేశ్వరీ అమ్మవారి ఆలయం వద్ద భక్తుల రద్దీ



రేగోడులో పోలేరమ్మ దేవి ఆలయానికి బోనాల ఊరేగింపుతో తరలివెళ్తున్న మహిళలు, భక్తులు



మక్తా భూపతిపూర్‌లో బోనాల ఊరేగింపు



ఖేడ్ మండలం తుర్కపల్లిలో ఎండ్లబండ్ల ప్రదర్శన



మెదక్‌లో బోనాల ఊరేగింపులో మహిళలు

పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శప్రాయం

● ఆయన స్ఫూర్తితో పోరాటాలు, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

● సుందరయ్య 39వ వర్ధంతి సభలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎల్లయ్య

గజ్వేల్, మే 19: పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శప్రాయమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య అన్నారు. ఆ పార్టీ మొట్టమొదటి ప్రధాన కార్యదర్శి, స్వాతంత్ర్య సమరయోధుడు, పార్లమెంటరీ మొదటి ప్రతిపక్ష పార్టీ నేత పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా, గజ్వేల్ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నాయకులతో కలసి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై పోరాటంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను సుందరయ్య స్ఫూర్తితో నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. సుందరయ్య తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించారని, అనేక సహాయ కార్యక్రమాలు చేశారని, అంటరానితనం, శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా పనిచేశారన్నారు. తన పేరు సుందర రామిరెడ్డి అయినా కుల వివక్ష ఉండకూడదని పోరాటం చేసి తన పేరులో ఉన్న రెడ్డి తొలగించి సుందరయ్యగా మార్చుకున్నారన్నారు. వారితో సీపీఎం జిల్లా నాయకులు రవి, బండ్ల స్వామి, ఐలయ్య, కనకయ్య, వెంకటాచారి, వెంకటేష్, నర్సింహులు, రాజు, మల్లేష్, చంద్రశేఖర్ తదితరులున్నారు.



గజ్వేల్: సీపీఎం కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



దుబ్బాక: పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



చేర్యాల: పార్టీ కార్యాలయంలో సుందరయ్య ఫొటో వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

● **దుబ్బాక/మిరుదొడ్డి:** తెలంగాణ రైతాంగ పోరాట, స్వతంత్ర్య సమరయోధుడు పుచ్చలపల్లి సుందరయ్యను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, భాస్కర్ అన్నారు. దుబ్బాక, మిరుదొడ్డి మండల కేంద్రాల్లో ఆదివారం వేరువేరుగా పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కులవ్యవస్థ నిర్మూలనకోసం పోరాటం చేసిన గొప్పవ్యక్తన్నారు. పేద, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిన పోరాటయోధుడని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు భాస్కర్, లక్ష్మీనారాయణ, అంజయ్య, ఎల్లయ్య, శ్రీనివాస్, నాగేందర్, గణేష్, కుమార స్వామి, క్రాంతి, రాజు, సాజిద్, అజయ్ ఉన్నారు.

● **చేర్యాల:** కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని సీపీఎం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంతో పాటు ముస్త్యాల గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో, పార్టీ మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో తదితరులు సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సుందరయ్య జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాళ్లబండి నాగరాజు, బండకింది అరుణ్‌కుమార్, పోలోజు శ్రీహరి, ఆముదాల నర్సిరెడ్డి, రాళ్లబండి భాస్కర్, గొర్రె శ్రీనివాస్, రేపాక కుమార్, గుండ్ర రవీందర్, కొమ్ము అశోక్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

కొమురవెల్లిలో...

కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాలలో పార్టీ సీనియర్ నాయకుడు నక్కల యాదవరెడ్డి తదితరులు పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, సురేందర్‌రెడ్డి, బాలరాజు, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులపై కాంగ్రెస్‌ది కపటప్రేమ

● ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ



వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

నారాయణరావుపేట, మే 19: రైతులపై కాంగ్రెస్ కపట ప్రేమ చూపిస్తూ, మోసం చేస్తున్నదని ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ మండిపడ్డారు. మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం మండల ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రైతులు పండించిన ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని మాటమార్చిందని అన్నారు. వర్షాలకు ధాన్య తడిసి రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వెంటనే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లయ్య, ఎంపీపీ ఉపాధ్యక్షుడు సంతోష్‌కుమార్, ఎంపీటీసీ హరీశ్, సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి, బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది'

ములుగు, మే 19: అకాలవర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు అధైర్య పడొద్దని గజ్వేల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కడపల కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ములుగులో కృష్ణారెడ్డి, యూత్ సీనియర్ నాయకుడు చింతకింది రాజు మాట్లాడుతూ.. అకాల వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రతిపక్ష నాయకుల మాటలను నమ్మి రైతులు మోసపోవద్దని వారు సూచించారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపొందుతుంది

● ఎంఈవో శ్రీనివాసరెడ్డి



సిరసనగండ్లలో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాసరెడ్డి

కొండపాక, మే 19: విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలు ఎంతో దోహదపడతాయని ఎంఈవో శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సిరసనగండ్లలో అంబేడ్కర్ యువజన సంఘం, గ్రామ ఉపాధ్యాయుడు దుబ్బ రాములు నూతన గ్రంథాలయానికి ఇరవై వేల విలువగల పుస్తకాలు, పదివేల విలువగల ర్యాకులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రత్యేకాధికారి అయిన ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. యువత చెడు అలవాట్లకు బానిసలు కాకుండా గ్రామ గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. విద్య అనేది సమాజంలో గౌరవాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో అంబేడ్కర్ యువజన సంఘ సభ్యులు, ఉపాధ్యాయులు రాములు, మల్లయ్య గంగాధర్ గ్రామ యువత గ్రామస్థులు పాల్గొన్నారు.

కంపు కొడుతున్న చేర్యాల పట్టణం

● అస్తవ్యస్తంగా డ్రైనేజీ కాలువ పనులు, పలుచోట్ల అర్ధాంతరంగా నిలిపివేత



గాంధీచౌక్ కల్వర్టు వద్ద మురుగునీరు

చేర్యాల, మే 19: చేర్యాల పట్టణం కంపుకొడుతున్నది. జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి పక్కన పలుచోట్ల డ్రైనేజీ నీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతున్నది. పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం నుంచి మార్కెట్ యార్డు వరకు ఎటు చూసినా, రెండు కిలోమీటర్ల మేర దోమలమోత నెలకొనడంతో స్థానికులు కలవరపడుతున్నారు. ప్రాణాపాయంపొంచి ఉన్నా ఎస్‌హెచ్‌తో పాటు మునిసిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుండడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కొన్నాళ్ల క్రితం రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువ నిర్మాణం చేపట్టారు. ఇష్టానుసారం గోతులు తీసి పలు ప్రదేశాలలో అర్ధాంతరంగా పనులు నిలిపివేశారు. రోడ్డుపక్కన ఇళ్లు, దుకాణాల మురుగు నీరును కాలువలోకి మళ్లించగా, నిర్మాణ సమయంలో కాలువలో పేరుకుపోయిన మట్టి తొలగించకపోవడంతో ఎక్కడికక్కడ పేరుకుపోయి అస్తవ్యస్తంగా తయారైంది. స్థానిక బాలాజీ కళామందిర్ మూలమలుపు వద్ద కాలువ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతమురుగునీరు రోడ్డుపై నుంచి ప్రవహిస్తుండడంతో చుట్టుపక్కల ప్రజలు, ప్రయాణీకులు నానాతంటాలుపడుతున్నారు. రైతుబజారు, తెలంగాణ తల్లి విగ్రహం ఎదురు, చర్చి ప్రాంగణం, చేనేత సహకారసంఘం భవనం మూలమలుపు, శ్వేత ఆస్పత్రి, సాయిరక్ష ఆస్పత్రి, ఎంఎంకే వైన్‌షాప్ ఆవరణ, గాంధీచౌక్ తదితర ప్రదేశాలలో గుంతల్లో మురుగు నీరు నిలిచిపోయింది. రోడ్డు కాంట్రాక్టర్ పనుల పూర్తి చేయకపోవడంతో పాటు మునిసిపల్ అధికారులు బ్లీచింగ్ చల్లడం, ఫాగింగ్ చేయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

అనాలోచితంగా నాటిన హరితహారం మొక్కలు

● విద్యుత్ సరఫరాలో అంతరాయం

● కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

మద్దూరు, మే 19: హరితహారంలో భాగంగా మొక్కల పెంపకాన్ని చేపడుతున్న అధికారులు ఎవెన్యూప్లాంటేషన్‌లో విద్యుత్ తీగల కింద మొక్కల్ని నాటుతుండడం విద్యుత్ అధికారులకు సమస్యగా మారుతున్నది. మండలంలో 9 విడుతల్లో హరితహారంన్ని చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మొక్కల పెంపకానికి నిర్దేశిత లక్ష్యం ఏర్పాటు చేయడంతో, విధిలేని పరిస్థితుల్లో అనాలోచితంగా ఎవెన్యూప్లాంటేషన్‌లో రోడ్డుకిరువైపులా విద్యుత్ తీగల కింద మొక్కల్ని నాటి అధికారులు చేతులు దులుపుకున్నారు. మొక్కలు వృక్షాలుగా మారి విద్యుత్ తీగలకు కొమ్మలు తగులుతుండడంతో గాలిదుమారం వీచినప్పుడు విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయాన్ని కలిగిస్తున్నాయి. తహసీల్దార్ కార్యాలయం నుంచి ముస్త్యాల వరకు రోడ్డుకు ఇరువైపులా సుమారు 7 కిలోమీటర్ల మేర మొక్కల పెంపకాన్ని చేపట్టారు. విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతూ, విద్యుత్ అధికారులకు పెద్ద సమస్యగా మారడంతో చెట్ల కొమ్మల్ని తొలగిస్తున్నారు. రెండు రోజులుగా మద్దూరులోని తహసీల్దార్ కార్యాలయం నుంచి స్థానిక పెట్రోల్ పంపు వరకు విద్యుత్ తీగల కింద ఉన్న చెట్లను, కొమ్మల్ని తొలగిస్తుండడంతో హరితహారంలో నాటిన మొక్కలు కనుమరుగవుతున్నాయి. వర్షాకాలానికి ముందే విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చెక్ పెట్టేందుకు, విద్యుత్ తీగల స్థానంలో కవర్ కండక్టర్ విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తే వర్షాకాలంతో పాటు గాలిదుమారమప్పుడు విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండి, ప్రజాధనం దుర్వినియోగమయ్యేది కాదని స్థానికులు అంటున్నారు. ఆ దిశలో విద్యుత్ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని తెలుస్తున్నది.



మద్దూరులో విద్యుత్ తీగల కింద ఉన్న చెట్లను, కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

పరామర్శలు

గజ్వేల్/మర్కుక్, మే 18: గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామానికి చెందిన ఉత్తనూరి లింగం మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆదివారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయనవెంట గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస, రైతుబంధు మాజీ కోఆర్డినేటర్ మద్ది రాజిరెడ్డి, గ్రామ నాయకులు ఉన్నారు. మర్కుక్ మండలంలోని గంగాపూర్‌కు చెందిన జుగ్రాజ్ విశాల్ కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మృతునికి బీఆర్ఎస్ సభ్యత్వం ఉన్నందున ప్రమాద బీమా నుంచి మంజూరైన రూ.2 లక్షల చెక్కును వంటేరు ప్రతాప్ రెడ్డి అందజేశారు.

ఆర్థిక సహాయం

జగదేవ్‌పూర్/మర్కుక్/కుకునూరుపల్లి, మే 19: జగదేవ్‌పూర్ మండల పరిధిలోని బస్వాపూర్, వట్టిపల్లి గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఇరువురి వృద్ధుల కుటుంబాలకు రూ.5000 చొప్పున మండల రజక సంఘం నాయకులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మర్కుక్ మండలంలోని ఇప్పలగూడెంకు చెందిన కత్తెరపాక లక్ష్మి ఇటీవల వడదెబ్బతో మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న వంటిమామిడి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బబ్బూరి రాందాస్‌గౌడ్ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ. 5000 అందజేశారు. తల్లిదండ్రులను కోల్పోయిన రాయవరం గ్రామానికి చెందిన రామిడ్ల స్వామికి కొండపాక మండల వైస్ ఎంపీపీదేవి రవీందర్ ఆదివారం రూ. 5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

'భారీ మెజారిటీతో గెలిపించాలి'

మద్దూరు, మే 19: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఎన్నికైన ఉత్కం ఆంజనేయులు, గౌరవ అధ్యక్షుడు శీలం సిద్ధయ్యాతో కలిసి మాట్లాడారు. పట్టభద్రుల సమస్యలపై గళం విప్పే తీన్మార్ మల్లన్నను గెలిపించుకోవాలని కోరారు. ప్రధాన కార్యదర్శిగా ఓగలబోయిన యాదగిరి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా వేచరేణి తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా గూళ్ల రవి, గ్రామ సోషల్ మీడియా ఇన్‌చార్జిగా కత్తుల భాస్కర్‌రెడ్డి ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పలువురు గ్రామ నాయకులు ఉన్నారు.

బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలి

● కొమురవెల్లి జడ్పీటీసీ సిద్ధప్ప



కొమురవెల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

చేర్యాల, మే 19: వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ, కొమురవెల్లి మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కొమురవెల్లి ఎంపీపీ తలారి కీర్తన, జడ్పీటీసీ సిలివేరు సిద్ధప్ప మాట్లాడారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి గళం వినిపించే ఏనుగు రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నతో పట్టభద్రులకు ఒరిగేదేమీలేదని, సమాజానికి నష్టం పొంచిఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గీస భిక్షపతి, నాయకులు ఏర్పుల మహేశ్, కొండా శ్రీధర్, బొడ్డం వంశీ, గొల్లపల్లి కిష్టయ్య పాల్గొన్నారు.

అనుమతులు లేని విద్యాసంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలి

● ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంజిత్‌రెడ్డి

చేర్యాల, మే 19: ప్రభుత్వ అనుమతులు లేకుండా జిల్లాలో కొనసాగుతున్న కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంజిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. కొమురవెల్లి మండలకేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రతి సంవత్సరం ఎన్నో విద్యాసంస్థలు పుట్టుకొస్తూ, వేలాది రూపాయలు ఫీజులు వసూలుచేస్తూ ప్రజలను దోచుకుంటున్నాయని ఆరోపించారు. సమావేశంలో నాయకులు తాడూరి విక్రమ్, యోగి, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ విభజన జరిగేనా?

● రాయపోల్‌కు ఏడేళ్ల నుంచి ఇన్‌చార్జి ఎంఈవోనే దిక్కు



ధ్వంసమైన ఎమ్మార్సీ భవన కిటికీల అద్దాలు

రాయపోల్, మే 19: గ్రామాల్లోని పాఠశాలలు మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రం(ఎమ్మార్సీ) ఆధ్వర్యంలో నడుస్తాయి. మండల విద్యాధికారి పర్యవేక్షణలో ఆయా పాఠశాలలు పనిచేస్తాయి. అలాంటిది ఏడేళ్లుగా ఇన్‌చార్జి ఎంఈవోనే రాయపోల్ మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2017 అక్టోబరు 11న దౌల్తాబాద్ మండలం నుంచి విడిపోయి రాయపోల్ కేంద్రంగా నూతన మండలం ఏర్పాటయింది. పోలీస్‌స్టేషన్‌తో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల విభజన వెంటనే జరిగిపోయింది. కానీ విద్యాశాఖ మాత్రం ఇంత వరకు విభజనకు నోచుకోలేదు. అప్పటి నుంచి దౌల్తాబాద్ మండల విద్యాశాఖ అధికారి రాయపోల్ మండలానికి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులతో నిర్వహించే వివిధ సమావేశాలు, శిక్షణా తరగతులను దౌల్తాబాద్‌లో నిర్వహిస్తుండడంతో తరచూ విద్యాబోధనకు అంతరాయం ఏర్పడుతున్నది. రాయపోల్‌లో ఏ ప్రభుత్వం శాఖకు సొంత కార్యాలయం నిర్మించలేదు. కానీ ప్రభుత్వం మండల వనరుల కేంద్రం నిర్మాణం కోసం అవసరమైన నిధులను ప్రభుతం కేటాయించింది. ఆర్వీఎం ఆధ్వర్యంలో నాలుగేళ్ల క్రితమే ఈ భవనాన్ని రాయపోల్‌లోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్మించారు. సుమారు రూ. 31 లక్షలతో ఈ అధునాతన భవనాన్ని నిర్మించగా, కానీ అది వినియోగంలోకి రాక నిరుపయోగంగా మారింది. ఎమ్మార్సీ భవనం కిటికీలకు ఏర్పాటు చేసిన అద్దాలు ధ్వంసమయ్యాయి. వచ్చే నెలలో విద్యా సంవత్సరం ప్రారంభం కానున్నందున ఆలోపు మండల విద్యాధికారిని నియమించి, ఆర్వీఎం భవనాన్ని వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

కాశీ విశ్వనాథస్వామి ఉత్సవాలు ప్రారంభం

దుబ్బాక, మే 19: ప్రతియేటా వైశాఖశుద్ధ ఏకాదశి రోజున నిర్వహించే కాశీవిశ్వనాథస్వామి ఉత్సవాలు దుబ్బాక పట్టణంలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ట్రాక్టర్లతో పట్టణంలో ర్యాలీ, వీరభద్రుడి ఎదుర్కోలు, వలుబండ ప్రదర్శన నిర్వహించారు. శివపార్వతుల కల్యాణంలో దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ వనితా భూంరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కాశీవిశ్వేశ్వర స్వామి రథోత్సవం సోమవారం తెల్లవారుజామున ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం భద్రకాళీ పూజలు, అగ్నిగుండ పూజలు, రథపూజ ఊరేగింపును, శివపూజను నిర్వహించనున్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ పూజారి కోరారు.



నంగునూరు: నర్మెట్టలో సీతారామచంద్రస్వామి కల్యాణంలో భక్తులు

సీతారామచంద్ర స్వామి కల్యాణం

నంగునూరు, మే 19 : నంగునూరు మండలం నర్మెట్టలో సీతారామచంద్ర బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సీతారామచంద్రస్వామి కల్యాణాన్ని అంతట శ్రీరామనవమి నాడు జరుపుకుంటారు. కానీ నర్మెట్టలో శ్రీరామనవమి రోజుతో పాటు విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా బ్రహ్మోత్సవాల్లో రెండోసారి స్వామివారి కల్యాణం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. స్వామి వారి కల్యాణం సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ రాళ్లబండి రమణాచారి ఇంటి నుంచి తలంబ్రాలను బాజా భజంత్రీలతో తీసుకువచ్చారు. అనంతరం అన్న వితరణ చేశారు. మూడు రోజులపాటు బ్రహ్మోత్సవాలు జరగనున్నట్లు రమణాచారి తెలిపారు. కల్యాణం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ రమణాచారి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయన రవీందర్‌రెడ్డి, రామ్మోహన్, శేఖర్, రాజిరెడ్డి, ఇరుకుల లింగమూర్తి బాపురాజు, రాజేశం, ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

కల్యాణ మహోత్సవానికి ఆలయం ముస్తాబు

చిన్నకోడూరు, మే 19: మడేలేశ్వరస్వామి శీతలదేవి కల్యాణ మహోత్సవానికి మండలంలోని మాచాపూర్ మడేలేశ్వరస్వామి ఆలయం ముస్తాబైంది. కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని నేటి (సోమవారం) నుంచి గురువారం వరకు నాలుగు రోజుల పాటు ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు రజకసంఘం సభ్యులు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

జీలుగతో భూసారం పెంపు

● ఉమ్మడి కొండపాక మండలం వ్యవసాయ అధికారి ప్రియదర్శిని

కుకునూరుపల్లి/దౌల్తాబాద్, మే 19: పచ్చిరొట్టె ఎరువు అయినా జీలుగ భూసారాన్ని పెంపొందిస్తుందని ఉమ్మడి కొండపాక మండల వ్యవసాయ అధికారి ప్రియదర్శిని తెలిపారు. జీలుగ విత్తనాలు ప్రభుత్వం 60 శాతం సబ్సిడీతో రైతులకు అందిస్తున్నదని, జీలుగ భూసారాన్ని పెంపొందించడమే కాకుండా నేలలోని చౌడును తగ్గిస్తుందని తెలిపారు. 30 కేజీల జీలుగ బ్యాగును రూ. 1130కే ప్రభుత్వం రైతులకు అందజేస్తుందని, కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతుసేవ కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని, రైతులు పట్టా పాస్ బుక్ జిరాక్స్ తీసుకెళ్లి విత్తనాలను కొనుగోలు చేయవచ్చని తెలిపారు. రైతులకు పచ్చిరొట్ట, జీలుగ విత్తనాలు దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ఆగ్రోస్ కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని, రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి గోవిందారాజులు సూచించారు. మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ.. పచ్చిరొట్ట, జీలుగ విత్తనాలు వాడటం వల్ల భూసారం పెరిగి అధిక దిగుబడి వస్తుందన్నారు.

కూర్మ (కప్పెర) నృసింహస్వామి జయంతి

తూప్రాన్, మే 19: తూప్రాన్ శివారులో వెలసిన నవ నారసింహుల్లో ఒకరైన శ్రీకూర్మ (కప్పెర) నృసింహస్వామి జయంతి ఉత్సవాలు ఈ నెల 20 నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ తెలిపారు. సోమవారం తొలిరోజు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, దేవతా హవనం, స్వామివారికి అభిషేకం, ధ్వజారోహణం, సాయంత్రం విష్ణుసహస్ర నామ పారాయణం ఉంటాయని వివరించారు. మంగళవారం స్వామివారికి పంచామృతాభిషేకం, అలంకరణ, ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, చందనాలంకార ఆకుపూజ, అగ్ని ప్రతిష్ఠాపన, మహానైవేద్యం ఉంటాయన్నారు. బుధవారం దేవతారాధన, సుదర్శన హోమం, పూర్ణాహుతి, ఉదయం 11గంటలకు స్వామివారి కల్యాణోత్సవం అన్నప్రసాద వితరణ, ధ్వజారోహణం ఉంటాయన్నారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఖేడ్ చిత్రకారుడు


నారాయణఖేడ్, మే 19: నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్టు శివకుమార్‌కు తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కింది. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని సౌత్ సెంట్రల్ రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన కార్యక్రమంలో శివకుమార్ 1,111కు పైగా రావి ఆకులపై చిత్రాలను వేసినందుకు తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు బాధ్యుడు వెంకటాచారి, అధ్యక్షుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత వేలు ఆనందచారి స్తపతి చేతుల నుంచి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు బ్యాడ్జి, సర్టిఫికెట్, మెడల్ అందించారు. అనంతరం శివకుమార్ మాట్లాడుతూ తనకు తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కడం చాలా సంతోషంగా ఉందన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులు దాచుకున్న డబ్బు చెల్లించాలి

సంగారెడ్డి అర్బన్, మే 19: ఆర్టీసీ ఉద్యోగులు దాచుకున్న డబ్బులు వెంటనే చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ, ఎస్‌డబ్ల్యూయూ రాష్ట్ర కార్యదర్శి పల్లె కృష్ణమూర్తి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ఫిబ్రవరి 10న సీఎం ఇచ్చిన చెక్కు నేటికి వంద రోజులు పూర్తయినా ఇప్పటి వరకు ఆర్టీసీలో పనిచేస్తున్న 27వేల మంది కండక్టర్లు, సూపర్‌వైజర్లు, గ్యారేజీ ఇతర సిబ్బందికి చెల్లింపులు జరగలేదన్నారు. నేడు జరగబోయే కేబినెట్ సమావేశంలోనైనా చర్చించి చెల్లింపులు జరిపేలా ఆర్టీసీ అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేయాలని ఆయన కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

చిలప్‌చెడ్ మే 19: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని గన్యతండాకు చెందిన రాత్లా విఠల్ కుమార్తె శిరీష అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్నది. చికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్‌కు వారు దరఖాస్తు చేసుకోగా రూ.1.45 లక్షల ఎల్‌వోసీ మంజూరైంది. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బాధిత కుటుంబానికి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఎల్‌వోసీని అందజేశారు.



కొమురవెల్లి మండలకేంద్రంలోని ప్రభుత్వ జడ్పీఎస్ఎస్‌లో 2003-04లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సత్కరించారు. పాతజ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఉద్వేగానికి లోనయ్యారు.
- చేర్యాల

కొనుగోలు కేంద్రాల్లో అధికారుల నిర్లక్ష్యం

● గాజులపల్లి పీఏసీఎస్ కేంద్రంలో తాలు పేరుతో తారుమారు

● మొదట్లోనే రైతులకు అధికారులు సరైనా స్పష్టత ఇవ్వకపోవడంతోనే నష్టం

● ఆ కొనుగోలు కేంద్రంలో పనిచేసే వ్యక్తి ధాన్యాన్ని మాత్రం ఒక్కరోజులోనే కొన్నవైనం

దౌల్తాబాద్, మే 19: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు మధ్యవర్తులకు ధాన్యం అమ్మి నష్టపోయారు. దౌల్తాబాద్ మండలంలోని గాజులపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రైతులు ధాన్యాన్ని తీసుకు వచ్చి ఆరబెట్టారు. అధికారులు, కేంద్ర నిర్వాహకులు మొదట కచ్చితంగా ధాన్యంలో తాలు తీయాలని, లేకుంటే కొనుగోలు చేయమని రైతులతో అన్నారు.

మొదట అలా.. తర్వాత ఇలా

వర్ష భయంతో చేసేదేమి లేక తాలు తీయడం ఇబ్బంది అవుతుందని, 20 మంది రైతులు సుమారు 1000 క్వింటాళ్ల ధాన్యాన్ని మధ్యవర్తులకు విక్రయించారు. తదుపరి రోజున సెంటర్ నిర్వాహకులు, అధికారులు తాలు తీయకున్న సరే కొనుగోలు చేస్తామని తెలిపారు. దీంతో మధ్యవర్తులకు ధాన్యం అమ్మి రూ.30 వేల నుంచి రూ.10 వేలు నష్టపోయామని రైతులు వాపోయారు. ఆ కొనుగోలు కేంద్రంలో పని చేసే వ్యక్తి, ఓ రోజు వరికోత కోశాడని, ధాన్యాన్ని ఆరబెట్టకపోయిన అదే రోజు కొనుగోలు చేశారని రైతులు ఆరోపించారు.

మేము నష్టపోయాం



నేను 150 క్వింటాళ్ల ధాన్యాన్ని తాలు తీయడం ఇబ్బంది అవుతుందని ప్రైవేట్‌లో అమ్ముకున్నా. నేను అమ్ముకున్న తర్వాత ధాన్యంలో తాళ్లు తీయకున్న కొనుగోలు చేస్తామని అధికారులు తెలిపారు. మొదటే ఆ విషయం చెబితే నేను బయట ధాన్యాన్ని అమ్ముకునేవాడిని కాదు. పీఏసీఎస్ అధికారుల నిర్లక్ష్యంతో నేను నష్టపోయాను, అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నా.

- కొన్యాలకరుణాకర్‌రెడ్డి, రైతు, గాజులపల్లి, దౌల్తాబాద్,మండలం

తాలు పేరుతో తారుమారు



ధాన్యం కొనుగోలు చేయాలంటే కచ్చితంగా తాలు తీయాలని కొనుగోలు కేంద్ర అధికారులు తారుమారు చేశారు. 190 క్వింటాళ్ల ధాన్యంలో తాలు తీయడం కష్టమైతదని నేను ప్రైవేట్‌లో అమ్ముకున్నా. మొదట్లోనే తాళ్లు తీయకున్న ధాన్యం కొనుగోలు చేస్తాం అని చెప్పి ఉంటే ప్రైవేట్‌లో అమ్మను కదా. దీని వల్ల సుమారు రూ.30 వేలు వరకు నష్టపోయా, అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రైవేట్‌లో అమ్ముకున్నా అధికారులపై చర్యలు తీసుకోవాలి.

- బొల్లి చంద్రం రైతు, గాజులపల్లి,దౌల్తాబాద్ మండలం